https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

సంపుటి - 01 | సంచిక - 310 | తెలంగాణ | మంగళవారం | తేదీ: 29.04.2024 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 6 | వెల రూ.3

## ప్రజలను మభ్య పెట్టే యత్నంలో కెసిఆర్

**బిఆర్ఎస్ మరితం పతనం ఖాయమన్న బండి**

హైదరాబాద్,ఏప్రిల్28

బిఆర్ఎస్ వజ్రోత్సవ సభవల్ల దేశానికి, రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. మళ్లీ అధికారం÷-లోకి వస్తామని, గెలుస్తామని ప్రకటించడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం తప్ప మరోటి లేదన్నారు. కేవలం మభ్య పెట్టే యత్నాల్లో కెసిఆర్ ఉన్నారని విమర్శించారు. బిఆర్ఎస్ తన పాలనలో ఆ పార్టీ ఏం చేసిందో, ఏం చేయలేదో చెప్పుకోలేక పోయిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజలకే ఏమీ చేయలేని ముఖ్యమంత్రి దేశానికి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు.



## కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

- నలుగురు ముష్కరులు నక్కిన స్థావరాల గుర్తింపు
- దొరికినట్లే దొరికి తప్పించుకుంటున్న ఉగ్రవాదులు
- ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలు లేపేస్తున్న పాక్



సిద్దిపేట టైమ్స్ ప్రతినిధి, శ్రీనగర్ ఓ వైపు పహల్గాం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట ముమ్మరంగా సాగుతోంది. మరోవైపు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రస్థావరాలను, పాక్ తరలిస్తోందని సమాచారం అందుతోంది. ఇక పహల్గామ్ నిందితుల్లో ఇప్పటికే ఆ నలుగురి లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా.. వారు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు.. ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి. దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో మిగతాది 2లో...

# ఖజానా ఖాళీ చేసి నిందలు

**ఎల్కతుర్తిలో కేసీఆర్ ప్రసంగంపై తీవ్రంగా స్పందించిన రేవంత్ రెడ్డి**

**కేసీఆర్ ప్రసంగం అక్కసుతో ఉందని, స్పష్టత లోపించిందని విమర్శ**

**రాహుల్ గాంధీతో తనకు గ్యాప్ లేదని స్పష్టం చేసిన రేవంత్**

**మావోయిస్టులతో చర్చలకు శాంతి కమిటీ ఏర్పాటుపై జానారెడ్డితో సీఎం భేటీ**



సిద్దిపేట టైమ్స్ ప్రతినిధి, హైదరాబాద్

బీఆర్ఎస్ ఎల్కతుర్తిలో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రసంగంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కేసీఆర్ ప్రసంగం పూర్తిగా అక్కసుతో నిండి ఉందని, ఆయన మాటల్లో స్పష్టత కొరవడిందని రేవంత్ రెడ్డి విమర్శించారు.రాష్ట్ర ఖజానాను కేసీఆర్ పూర్తిగా ఖాళీ చేసి, ఇప్పుడు ఆ నిందను కాంగ్రెస్ ప్రభుత్వంపై మోపే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారుమిగతాది 2లో...





## అభ్యర్థుల సంఖ్య పెరిగింది నిజమే!

- లెక్కింపులోనే తేడా వచ్చింది
- ఒకే సెంటర్ నుంచి ఎక్కువమంది ఎంపికవడం తప్పు కాదు
- గ్రూప్-1పై అప్పీల్ పిటిషన్‌లో టీజీపీఎస్సీ

6

## ఓటీటీలు, సోషల్ మీడియాలో అశ్లీల కంటెంట్... కేంద్రానికి సుప్రీం నోటీసులు





- ఓటీటీ, సోషల్ మీడియాలో అశ్లీల కంటెంట్ నియంత్రణపై సుప్రీంకోర్టులో విచారణ
- నియంత్రణ కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ
- కేంద్ర ప్రభుత్వం, పలు ఓటీటీ, సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు జారీ
- ఇలాంటి కంటెంట్‌తో మనసులు కలుషితమవుతాయని, నేరాలు పెరుగుతాయని కోర్టు ఆందోళన
- కొన్ని నిబంధనలున్నాయని, మరిన్ని తెస్తామని కేంద్రం తరుపున ఎస్జీ వెల్లడి

2లో

## రాజ్యసభ అభ్యర్థిగా పాకా

- ఖరారు చేసిన బిజెపి అధిష్టానం
- విజయసాయి రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన స్థానానికి ఉప ఎన్నిక
- మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ల దాఖలుకు తుది గడువు
- ప్రస్తుతం ఏపీ బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ గా ఉన్న పాకా సత్యనారాయణ
- పలువురి పేర్లు ప్రచారంలో ఉన్నా... అధిష్టానం ఆయన వైపే మొగ్గు



2లో

## ఆపోక్స్ పై మంత్రి వర్గ ఉపసంఘం

**సభ్యులుగా నారాయణ, లోకేశ్, పయ్యావుల**

అమరావతి, **ఏప్రిల్ 28**





ఆంధ్రప్రదేశ్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్ కార్పొరేషన్(ఆపోకస)పై ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకునే ప్రస్తుత వ్యవస్థపై సమీక్షించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపసంఘంలో మున్సిపల్ మంత్రి నారాయణ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఉన్నారు. ప్రస్తుత వ్యవస్థ కంటే మరింత జవాబుదారీగా, సమర్థవంతంగా, పారదర్శకంగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకాలు, వారి సంక్షేమాన్ని ఎలా పెంపొందించాలన్న దానిపై నివేదిక ఇవ్వనుంది.

## ఏపీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి

- 10 జిల్లాలకు డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల నియామకం
- ఖరారు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



## పద్మ అవార్డుల ప్రధానం

**- రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా పద్మ భూషణ్ అందుకున్న బాలకృష్ణ**

సిద్దిపేట టైమ్స్ ప్రతినిధి, న్యూఢిల్లీ ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మ భూషణ్ అవార్డు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనకు పురస్కారం అందజేశారు. రాష్ట్రపతి భవన్‌లో పద్మ అవార్డుల వేడుక జరిగింది. గణతంత్ర దినోత్సవం వేళ కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలు ప్రకటించిన సంగతి తెలిసిందే.2025 సంవత్సరానికి గాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం పద్మ పురస్కారాల ప్రదానోత్సవం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో అట్టహాసంగా జరిగింది. మిగతా 2లో...

## కేసీఆర్‌ది ఆవసర వాదం

2

- నాడు శృతి, సాగర్ ను ఎన్ కౌంటర్ చేయించి నేడేమో మావోయిస్టులను చర్చలకి పిలవాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తుండు...
- కేసీఆర్ మీ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి సవాల్



# ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి సహకరించండి..

## ఢిల్లీలో కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్

**కర్నూలు**
ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి అగ్రగామి గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను స్థాపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి పూర్తిగా సహకరించాలని కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను.. మంత్రి టి.జి భరత్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి టి.జి భరత్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబంధించి కీలక అంశాలపై చర్చించారు. టమోటా పంటను అధికంగా పండిస్తున్న రాయలసీమ జిల్లాల్లో ఆపరేషన్ గ్రీన్స్ పథకం కింద మొదటి విడత రెండవ విడత మొత్త%శీ% రూ. 9.76 కోట్లు విడుదల చేయాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఆరు నెలల్లోపు మొత్తం ప్రాజెక్ట్‌ను త్వరగా పూర్తి చేయడానికి మిగిలిన గ్రాంట్ మొత్తం రూ. 34.17 కోట్లు విడుదల చేయాలని వినతిపత్రం ద్వారా కోరారు. రాయలసీమ జిల్లాల్లో రైతులు టమోటా పంటను అత్యధికంగా సాగు చేస్తారని కేంద్ర మంత్రికి వివరించారు. టమోటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటుచేయడం ద్వారా పంట కోత తర్వాత నష్టం



జరగకుండా చేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్రంలోని దక్షిణ ప్రాంతానికి ఈ కేంద్రాలు ఎంతో ముఖ్యమైనవని చెప్పారు. దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలలో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించిందన్నారు.
ఇక రాష్ట్రంలోని అన్ని జిల్లాలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో 175 పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి టి.జి భరత్.. కేంద్ర మంత్రికి వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లను అభివృద్ధి చేయడం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పీఎంకేఎస్‌వై స్కీమ్స్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలనుకునే వారు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా నేరుగా అప్లై చేసుకునేలా ఏపీకి వెసులుబాటు కల్పించాలని మంత్రి టి.జి భరత్ కోరారు. ఇప్పుడున్న ప్రక్రియ పెట్టుబడుల ప్రతిపాదనలను సకాలంలో సమర్పించడానికి ఒక అడ్డంకిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగం అభివృద్ధికి ఎంతో దోహదపడే ఈ అంశాన్ని పరిశీలించాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సందర్భంగా తిరుపతి ఐఐటీలో ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రూ. 2.67 కోట్ల గ్రాంట్‌తో స్థాపించిన ఇంక్యూబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి రావాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగానికి సంబందించిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు మంత్రి టి.జి భరత్ తెలిపారు.

# కాశ్మీర్‌లో కొనసాగుతున్న ఉగ్రవాదుల వేట

(మొదటి పేజి తరువాయి)
ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా.. ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉందని ఓ సైనిక అధికారి వ్యాఖ్యానించారు. ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహ్సిల్ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు- దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టు-పక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు- సైనికాధికారి వెల్లడించారు. ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇం-టె-లిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఉగ్రవాదులు కిష్త్వార్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే.. భద్రతా దళాలకు సమస్యలు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడి పర్వతాలు పహల్గాం వైపు శిఖరాలతో కలిసి ఉంటాయి. తక్కువ మంచు ఉండటంతో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి వారు చిక్కటి అడవులు ఉన్న జమ్మూ ప్రాంతంలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాం చుట్టు-పక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. తమ వారితో మాట్లాడేందుకు వాటిని వాడొచ్చన్న అనుమానాలు ఉండటంతో టె-క్నికల్ ఇంటెలిజెన్స్ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. భారత్ తగిన సమాధానం ఇచ్చే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ తరుణంలో పీవోకేలోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను పాకిస్థాన్ సైన్యం ఖాళీ చేయిస్తున్నట్లు తెలుస్తోంది. వారిని ఆర్మీ షెల్టర్లు, బంకర్లకు తరలించడం ప్రారంభించింది. ఈ మేరకు నిఘా వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనం ప్రచురితమైంది.
భారత భద్రతా సంస్థలు క్రియాశీలకంగా ఉన్న పలు లాంచ్‌ప్యాడ్‌లను గుర్తించిన నేపథ్యంలో పాక్ ఈ చర్యలు తీసుకుంటు-న్నట్లు- తెలుస్తోంది. పీఓకేలోని కెల్, సర్ది, దుధ్నియల్, అత్ముఖం, జురా, లిపా, పచ్చిబన్, ఫార్వర్డ్ కహుతా, కొట్లి వంటి పలు ప్రాంతాల నుంచి ఉగ్రవాదులను తరలిస్తున్నట్లు- నిఘా వర్గాల సమాచారం. ఉగ్రవాదులు జమ్మూకశ్మీర్‌లోకి చొరబడటానికి ముందు వారు నివసించే కీలక కేంద్రాలుగా ఈ లాంచ్‌ప్యాడ్స్ పనిచేస్తాయి. వీటిలో 150 నుంచి 200 మంది శిక్షణ పొందిన ఉగ్రవాదులు ఉన్నారని, వారంతా చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నాయి. పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో భారత్, పాక్‌ల ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది అక్కసు వెళ్లగక్కింది.

# కేసీఆర్‌ది ఆవసర వాదం

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 28:**
బిఆర్ఎస్ హయాంలో వరంగల్ బిడ్డలు శృతి, సాగర్‌లను కిరాతకంగా ఎన్ కౌంటర్ చేయించిన కేసీఆర్ ....,గద్దర్ కలవడానికి వస్తే ప్రగతిభవన్ గేట్లను కూడా తెరవని కేసిఆర్ ... ఇప్పుడు మావోయిస్టులను చర్చలకి పిలవాలని కేంద్రాన్ని డిమాండ్ చెయ్యడం కేవలం అవసరవాదం.అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎం. విజయశాంతి అన్నారు. ఆమె సోమవారం సోషల్ మీడియాలో ఓ పోస్టు చేస్తూ..నిన్నటి(ఆదివారం)బి ఆర్ఎస్ సభ నుండి కేసీఆర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ప్రాజెక్టులు కట్టాం.. సంక్షేమ పథకాలు అమలు చేశామని కేసీఆర్ చెప్పుకున్నారు. కానీ,ఈ పథకాలు, ప్రాజెక్ట్‌ల పేరు చెప్పి 7 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసిన విషయాన్ని, వాటి ద్వారా కేసీఆర్ కుటుంబం కమీషన్లు తీసుకున్న విషయాన్ని మాత్రం దాచేశారన్నారు.
ఇలా కేసీఆర్ కుటుంబం కమిషన్ల రూపంలో దోచుకున్న ప్రభుత్వ సొమ్మును తిరిగి ఖజానాకు రాబట్టగలిగితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేయడానికి నిధులు అవసరం కన్నా ఎక్కువే సమకూరుతాయన్నారు.అసెంబ్లీకి వస్తే, కాంగ్రెస్ సభ్యులు ఈ విషయంపై నిలదీస్తారనే భయంతో.. తప్పించుకు తిరుగు వాడు ధన్యుడు సుమతి అన్నట్లు కేసీఆర్ గారి వైఖరి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తొత్తులుగా మారి, హద్దులు దాటవద్దని కేసీఆర్ పోలీస్ వారికి వార్నింగ్ ఇవ్వడం చాలా విడ్డూరంగా ఉందన్నారు.బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పోలీసులను తొత్తులుగా వాడుకుని, చట్ట విరుద్ధంగా పోలీసులతో ప్రత్యర్థుల ఫోన్లు టాప్పింగ్ చేయించారు. మీ ఉచ్చులో పడిన కొందరు పోలీసు అధికారులు హద్దులు దాటడం వల్ల, ఇప్పుడు దేశ సరిహద్దులు దాటి, దొంగల మాదిరిగా దాక్కోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు.
పాతికేళ్ళ బీఆర్ఎస్ ప్రస్థానంలో తెలంగాణను అభివృద్ధి చేశామని కేసిఆర్ చెప్పున్నారు ఈ పాతిక సంవత్సరాలలో తెలంగాణ ఆర్థిక అభివృద్ధి కంటే కేసిఆర్ కుటుంబ సభ్యుల ఆర్థిక స్థోమత ఎన్ని వేల రెట్లు పెరిగిందో చర్చిండానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టడానికి ముందు కేసిఆర్ కుటుంబ సభ్యుల ఆస్తులు ఎంత? ఇప్పుడు ఒకొక్కరి ఆస్తులు ఎన్ని వేలకోట్లకు చేరాయో సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం సిద్ధమా? అని విజయశాంతి సవాల్ విసిరారు.

## ఓటీటీలు, సోషల్ మీడియాలో
# అశ్లీల కంటెంట్... కేంద్రానికి సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 28**
ఓటీటీ వేదికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతున్న అశ్లీల, అసభ్యకరమైన కంటెంట్‌ను నియంత్రించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ అంశంపై స్పందన తెలియజేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వంతో పాటు పలు ఓటీటీ, సోషల్ మీడియా సంస్థలకు సోమవారం నోటీసులు జారీ చేసింది.
జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసిహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఓటీటీ, సోషల్ మీడియాలో లైంగికంగా అసభ్యకరమైన కంటెంట్‌ను నిషేధించేందుకు, కట్టడి చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని, ఇందుకోసం ఒక జాతీయ కంటెంట్ నియంత్రణ అథారిటీని ఏర్పాటు చేయాలని ఐదుగురు పిటిషనర్లు తమ వ్యాజ్యంలో కోర్టును అభ్యర్థించారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.
విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ తరహా కంటెంట్ నియంత్రణకు సంబంధించి ఇప్పటికే కొన్ని నిబంధనలు అమల్లో ఉన్నాయని, భవిష్యత్తులో మరిన్ని కఠిన నిబంధనలను అమలు చేస్తామని ఆయన ధర్మాసనానికి తెలిపారు.ఈ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి అభ్యంతరకరమైన కంటెంట్ వల్ల కేవలం పిల్లలు, యువత మాత్రమే కాకుండా పెద్దల ఆలోచనలు కూడా కలుషితం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది సమాజంలో వికృత పోకడలకు, అసహజ లైంగిక ధోరణులకు దారితీసే ప్రమాదం ఉందని పేర్కొంది. తద్వారా దేశంలో నేరాల సంఖ్య పెరిగే అవకాశం ఉందని హెచ్చరించింది.అయితే, విచారణ సమయంలో పిటిషనర్లు పరిపాలన, కార్యనిర్వాహక వ్యవహారాలకు సంబంధించిన అంశాన్ని లేవనెత్తారని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రస్తావించారు. ఇప్పటికే న్యాయస్థానాలు పరిపాలన, కార్యనిర్వాహక విషయాల్లో జోక్యం చేసుకుంటున్నాయనే ఆరోపణలు తమపై వస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో, తదుపరి విచారణలో కేంద్రం, సంబంధిత సంస్థలు తమ స్పందనను తెలియజేయాల్సి ఉంటుంది.

# ఏపీలో నామినేటెడ్ పోస్టుల భర్తీ పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం కీలకమైన నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 10 జిల్లాలకు సంబంధించి జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ల నియామకాలను ఖరారు చేశారు.

**వివిధ జిల్లాల డీసీసీబీ చైర్మన్లుగా నియమితులైన వారు:**
శ్రీకాకుళం: శివల సూర్యనారాయణ
విజయనగరం: కిమిడి నాగార్జున
విశాఖపట్నం: కోన తాతారావు
గుంటూరు: మాకినేని మల్లికార్జునరావు
కృష్ణా: నెట్టెం రఘురాం
నెల్లూరు: ధనుంజయ రెడ్డి
చిత్తూరు: అమ్మస రాజశేఖర్ రెడ్డి
అనంతపురం: కేశవ రెడ్డి
కర్నూలు: డి. విష్ణువర్ధన్ రెడ్డి
కడప: సూర్యనారాయణ రెడ్డి

**వివిధ జిల్లాల డీసీఎంఎస్ చైర్మన్లుగా నియమితులైన వారు:**
శ్రీకాకుళం: చౌదరి అవినాష్
విశాఖపట్నం: కోట్ని బాలాజీ
విజయనగరం: గొంప కృష్ణ
గుంటూరు: వర్తనం హరిబాబు
కృష్ణా: బండి రామకృష్ణ
నెల్లూరు: జి. నాగేశ్వరరావు
చిత్తూరు: సుబ్రహ్మణ్యం నాయుడు
అనంతపురం: నెట్టం వెంకటేశ్వరులు
కర్నూలు: నాగేశ్వర యాదవ్
కడప: ఎర్రగొండ్ల జయప్రకాశ్
ఈ నియామకాలతో కీలకమైన సహకార రంగ సంస్థలకు కొత్త అధిపతులు వచ్చినట్లయింది. ప్రభుత్వం త్వరలోనే మరిన్ని నామినేటెడ్ పోస్టులను కూడా భర్తీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఎన్‌డిఎ రాజ్యసభ అభ్యర్థిగా పాకా

## ఖరారు చేసిన బిజెపి అధిష్టానం

**అమరావతి,ఏప్రిల్ 28** ఏపీలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం భర్తీపై ఎట్టకేలకు ఉత్కంఠ వీడింది. మందకృష్ణ పేరు ఖరారు అవుతుందన్న ఊహాగానాలకు తెరదించారు. ఎన్డీయే అభ్యర్థిగా పాకా వెంకటసత్యనారాయణను అధిష్ఠానం ప్రకటించింది. ఆయన ప్రస్తుతం ఏపీ భాజపా క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఉన్నారు. విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో ఒక స్థానం ఖాళీ అయ్యింది. మరో రెండేళ్ల పదవీ కాలం ఉన్న నేపథ్యంలో ఉపఎన్నికకు ఎన్నికల సంఘం ఇటీ-వల నోటిఫికేషన్ విడుదల చేసింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలతో నామినేషన్ గడువు ముగియనున్న నేపథ్యంలో.. భాజపా ఏపీ కోర్ కమిటీ- సమావేశమైంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి యూరప్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. పాకా వెంకటసత్యనారాయణవైపు మొగ్గు చూపిన పార్టీ అధిష్ఠానం ..ఆయన్ని అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు.

# పద్మ అవార్డుల ప్రధానం

(మొదటి పేజి తరువాయి)
భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము చేతుల మీదుగా పలు రంగాల్లో విశేష కృషిని అందించిన కళాకారులు అవార్డులను అందుకున్నారు.ఈ సందర్భంగా తెలుగు సినీ పరిశ్రమ నుండి హీరో నందమూరి బాలకృష్ణకి కేంద్రం పద్మ భూషణ్ అవార్డును అందుకున్నారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచె కట్టులో బాలకృష్ణ'పద్మ' అవార్డుల ప్రదానోత్సవానికి హాజరయ్యారు. దిల్లీలోని మాన్‌సింగ్ రోడ్డు నుంచి రాష్ట్రపతి భవన్‌కు కుటుంబంతో కలిసి ఆయన బయలుదేరిన దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. తండ్రి అడుగు జాడల్లో ప్రయాణించి నటుడిగా ప్రశంసలు దక్కించుకున్నారు బాలకృష్ణ. గతేడాది 50 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. పౌరాణికం, జానపదం, సాంఘికం, సైన్స్ ఫిక్షన్, బయోపిక్.. ఇలా అన్ని జానర్లను టచ్ చేసిన ఏ-కై-క అగ్ర నటు-డిగా ఆయన తెలుగు ప్రేక్షకుల మది దోచుకున్నారు. క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్‌గా ఎంతో మందికి ఆపన్న హస్తం అందిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఆయనకు 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రకటించింది.

# ఖజానా ఖాళీ చేసి నిందలు

(మొదటి పేజి తరువాయి)
. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి, తనకు మధ్య దూరం పెరిగిందంటూ వస్తున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రాహుల్ గాంధీతో తనకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదని స్పష్టం చేశారు.అవసరాలకు అనుగుణంగా కేసీఆర్, ప్రధాని నరేంద్ర మోదీ తమ వైఖరిని మార్చుకుంటున్నారని విమర్శించారు. దేశానికి దివంగత ప్రధాని ఇందిరా గాంధీ లాంటి నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డితో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా పలు కీలక అంశాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, రాష్ట్రంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు వీలుగా ఒక శాంతి కమిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ అంశంపై పార్టీలో తదుపరి చర్చల బాధ్యతను జానారెడ్డి, మరో సీనియర్ నేత కె. కేశవరావు చూస్తారని చెప్పారు.ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలని, వారు వెళితేనే పథకాలు ప్రజల్లోకి వెళతాయని అన్నారు. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయని అన్నారు. ఇష్టానుసారంగా మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారని హెచ్చరించారు.

# జెత్వానీ ఎవరో తెలీదు

**కుక్కల విద్యాసాగర్ కూడా నాకు తెలియదు**
**నేను జిల్లా అధికారిని కాదు..**
**దర్యాప్తు అధికారిని అంతకన్నా కాదు**
**సీఐడీ ప్రశ్నలకు పీఎస్ఆర్ జవాబులు**
**విచారణకు సహకరించని సీనియర్ ఐపీఎస్**
**నేటితో పోలీసు కస్టడీ పూర్తి**



విజయవాడ,
'నేను జిల్లా అధికారిని కాదు.. ఏ కేసులోనూ దర్యాప్తు అధికారిని అంతకన్నా కాదు.. నాకేమీ తెలియదు..' సీఐడీ విచారణలో సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు చెప్పిన సమాధానాలివి. ముంబై నటి కాదంబరి జెత్వానీ గానీ, వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ గానీ తనకు తెలియదని చెప్పారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు ఆయన దాటవేత ధోరణిలో జవాబులిచ్చినట్లు తెలిసింది. జెత్వానీని వేధింపులకు గురిచేసిన కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పీఎసఆర్(ఏ-2)ను మూడ్రోజులు కస్టడీలో విచారించేందుకు కోర్టు అనుమతించగా.. తొలిరోజు ఆదివారం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించినప్పుడు బీపీ ఎక్కువగా ఉండడంతో సీఐడీ అధికారులు ఆయన్ను తిరిగి జైలులోనే అప్పగించారు. సోమవారం ఉదయం జైలు నుంచి ముందుగా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చేసిన పరీక్షల్లో బీపీ 160/95గా ఉండడంతో విచారణకు తీసుకెళ్లారు. కానూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయంలో సాయంత్రం 5 గంటల వరకు విచారించారు. దర్యాప్తు అధికారి (ఆర్ఐవో) ప్రసాద్ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆయన్ను ప్రశ్నించాయి. మొత్తం 82 ప్రశ్నలు సంధించాయి. జెత్వానీపై కేసు నమోదు చేయాలని ఎవరు ఆదేశించారని అడుగగా.. అసలామె ఎవరో తనకు తెలియదని పీఎసఆర్ బదులిచ్చారు. కుక్కల విద్యాసాగర్ ఎవరి ద్వారా కలిశారని అడుగగా.. ఆయన కూడా తనకు తెలియదని చెప్పారు. స్వాధీనం చేసుకున్న ఫోన్‌ను చూపించి అది ఎవరిదని ప్రశ్నిస్తే.. తనదేనని అంగీకరించారు.
ఉపయోగించిన సిమ్ నంబర్‌ను ప్రస్తావించగా.. అది కూడా తనదేనని చెప్పారు. జెత్వానీపై కేసు నమోదు చేయడానికి ముందు జగన్ నివాసాని(సీఎంవో)కి వెళ్లారు కదా అని అడుగగా.. వెళ్తే వెళ్లి ఉండవచ్చని దాటవేశారు. కోర్టు ఇచ్చిన మూడ్రోజుల కస్టడీ గడువు మంగళవారంతో ముగియనుంది. చివరిరోజు సీఐడీ మరో 80 ప్రశ్నలు సిద్ధం చేసినట్లు సమాచారం. విచారణ అనంతరం పీఎసఆర్‌ను జైలుకు తరలిస్తారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అలసత్వం వద్దు

- రైతులు పండించిన పంటలు దళారులకు అమ్ముకోవద్దు
- కొనుగోలు ప్రక్రియను మరింత వేగం చేయాలి
- ఐదు శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించండి
- మున్సిపల్ కమిషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి



సిద్దిపేట్ టైమ్స్ , దుబ్బాక ప్రతినిధి

రైతులు దళారులను ఆశ్రయించకుండా, పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని, ధాన్యం కొనుగోలు ప్రక్రియను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సోమవారం దుబ్బాక మున్సిపాలిటీ లోని చెల్లాపూర్ 2, 3 వార్డుల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ....తేమ, తూకం విషయంలో పొరపాట్లకు తావు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. విపరీతమైన ఎండలతోపాటు అకాల వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో మూలకు చేరిన తాలు యంత్రాలను తక్షణమే మరమ్మత్తులు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలని సిబ్బందిని కోరారు. మున్సిపాలిటీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి పన్ను చెల్లించే వారికి అందించే ఐదు శాతం రాయితీతో కూడిన ఎర్లీ బర్డ్ పథకం మరో రెండు రోజుల్లో ముగియనుందని, ప్రజలంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.పట్టణంలోని మూడు చోట్ల నిర్మించిన మున్సిపల్ దుకాణాలకు సంబంధించి ఖాళీగా ఉన్న 12 దుకాణాలకు బహిరంగ వేలం వేసే ప్రక్రియ వచ్చేనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ వేలం ప్రక్రియకు సంబంధించి ఈనెల 29 నుంచి మే 7వ తేదీ వరకు ఆసక్తి గలవారు బ్యాంకు డిడితో కూడిన దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట మెప్మా సీఈవో సరిత, ఆర్పీలు, రైతులు తదితరులు ఉన్నారు.



## వికలాంగుల సామూహిక భవన నిర్మాణం కోసం కలెక్టర్ కు వినతి

సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల వికలాంగుల కోసం చేర్యాల పరిధిలో సామూహిక వికలాంగుల భవనం నిర్మించాలని కోరుతూ నాలుగు మండలాల వికలాంగులు సోమవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు మండలాలలో అధిక సంఖ్యలో వికలాంగులు ఉన్నారని ప్రతి నెల చేర్యాలలో సమావేశాలు జరుపుకుంటున్నామని తెలిపారు. సామూహిక భవనం లేక తాము ఇబ్బందులు పడుతున్నామని తమకు భవనాన్ని నిర్మించి ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల వేదిక గౌరవ అధ్యక్షుడు పర్వతం మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి అనిల్, సంఘ ప్రతినిధులు తుమ్మలపల్లి అనిల్ కుమార్, ఎన్పిఆర్డి ఇండియా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల నరసింహులు, మేకల ఆండాలు, మోటం గణేష్, మోటం శ్యామల, సింగారపు యాదగిరి, మాచర్ల రాజు, మమత, ఆలేటి రాజు తదితరులు ఉన్నారు.

## సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం లాంటిది

- నిరుపేద కుటుంబాల నాదుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేట టైమ్స్ , దుబ్బాక ప్రతినిధి



ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు ఒక వరం లాంటిదని ఎంతోమంది నిరుపేదలకు సీఎం సహాయ నిధి కింద ఆదుకోవడం జరిగిందని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున తన సగృహంలో దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన ఇందూరి రేణుక - భాస్కర్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిది కింద మంజూరైన 90 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేద కళ్ళల్లో ఆనందం చూడడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందిస్తున్నాడన్నారు. సీఎం సహాయ నిధి కింద ఇప్పటివరకు ఎంతోమంది పేద ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. నిరుపేద కుటుంబాల నాదుకోవడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేసిన బిఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు

నిజాంపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి..

సిద్దిపేట టైమ్స్ రామాయంపేట ప్రతినిధి



వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన రథోత్సవ భారీ బహిరంగసభ బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ సీఎం కేసీఆర్ కార్యకర్తలను నాయకులను ప్రజలకు మంచి సందేశాన్ని ధైర్యాన్ని కలిపిస్తూ ప్రసంగాన్ని కొనసాగించారు. ఈ ఉత్సాహంతో నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి రాబోయేకాలంలో మన పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు.భారీ బహిరంగ సభ విజయవంతం చేయడంలో భాగ్య స్వాములైన బిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కార్యకర్తలకు నిజాంపేట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పరిపాటి సుధాకర్ రెడ్డి,ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.బిఆర్ఎస్ పార్టీని తెలంగాణకు శ్రీరామరక్ష అన్నారు.

## నేడు కలెక్టరేట్ కార్యాలయం ప్రజావాణి హాల్లో బార్ అండ్ రెస్టారెంట్ డ్రా కార్యక్రమం

జిల్లా ప్రొబిషనరీ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి



సిద్దిపేట్ టైమ్స్ మెదక్ జిల్లా ప్రతినిధి

నేడు ఉదయం-11 గంటలకు కలెక్టరేట్ కార్యాలయ ప్రజావాణి హాల్ నందు బార్ అండ్ రెస్టారెంట్ డ్రా కార్యక్రమం ద్వారా కేటాయింపు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మెదక్ పట్టణంలో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణ లాటరీ ద్వారా ఎంపికకు సంబంధించిన వివరాలను జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలియజేస్తూమెదక్ పట్టణంలో గత మూడు సంవత్సరాలుగా మూతబడి ఉన్న బార్ అండ్ రెస్టారెంట్ కు రీ నోటిఫికేసన్ ఇవ్వడం జరిగిందని తద్వారా బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు 20 దరఖాస్తులు వచ్చాయని రేపు అనగా మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రజావాణి మీటింగ్ హాల్ నందు అదనపు కలెక్టర్ నగేష్ అధ్యక్షతన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు లాటరీ ద్వారా కేటాయింపులు జరుగుతున్న సందర్భంలో దరఖాస్తుదారులు మెదక్ కలెక్టరేట్ కార్యాలయానికి రేపు ఉదయం 10:30 గంటలకల్లా హాజరు కావాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు.

## నీట్ పరీక్ష నిర్వహణకు పగడ్బందీగా ఏర్పాట్లు

జిల్లా అదనపు కలెక్టర్ గరిమ అగ్రవాల్..



సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ప్రతినిధిబీ ఏప్రిల్ 28

యూజీ నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సంబంధిత అధికారులతో జిల్లా అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించి మే 4వ తేదీన నిర్వహించనున్న యూజీ నీట్ పరీక్ష నిర్వహణపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా యూజీ నీట్ పరీక్షలు సమర్ధవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్) మరియు బాలికల ఉన్నత పాఠశాల 2 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఇప్పటికే పరీక్ష నిర్వహణకు అధికారుల ఎంపిక పూర్తిచేసి శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. పరీక్షరాసే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్ష కేంద్రాల్లో త్రాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, మరుగుదొడ్డి తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ నిర్వహించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష రోజు పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించాలని, నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బేసిక్ మెడిసిన్స్ తో స్టాఫ్ నర్స్ మరియు ఆశ వర్కర్ తో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని అన్నారు. లిమే 4వ తేదీన పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుంది కాబట్టి అభ్యర్థులు ముందస్తుగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. అలాగే అభ్యర్థులు ఒకరోజు ముందే పరీక్ష కేంద్రాలను చూసుకుంటే బాగుంటుందని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, వాచ్లు, క్యాలిక్యులేటర్ లు సహా ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించకూడదని అన్నారు. అలాగే అభ్యర్థుల వెంట హాల్ టికెట్, గుర్తింపు కార్డు, ట్రాన్సపరెంట్ వాటర్ బాటిల్, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫొటోస్, బాల్ పాయింట్ పెన్ లను మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష నిర్వహణ అధికారులకు కూడా మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు అని తెలిపారు. లిఏమైనా సందేహాలు ఉంటే కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్ 08457 230000 ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ సూర్య ప్రకాష్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యుత్ శాఖ ఎస్ఈ, సిద్దిపేట మున్సిపాలిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని సంపాదించండి.

మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి



సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట

సెలవులను సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని సంపాదించండి.

మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి కీ.శే. కూర భూపతి రెడ్డికి పూలమాల వేసి ఎజాస్ అహ్మద్ నిర్వహిస్తున్న చేతిరాత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ "విద్యార్థులు సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే వాళ్ళే పై స్థాయికి వస్తారని, ఆ ఉద్దేశం తో ఈ శిబిరంలో తమ పిల్లలను చేర్పించిన తల్లిదండ్రులకు అభినందలు తెలియజేశారు. ప్రతి విద్యార్థికి చదువు, జ్ఞానం, తెలివి ఎంత ఉన్నా వాటిని పరీక్షల్లో, నోట్ బుక్ లో చేతిరాత రూపంలోనే వ్యక్తపరుస్తారు. ఇంతటి ప్రాముఖ్యత గల చేతిరాతను చాలా వరకు నిర్లక్ష్యం చేస్తారు. ప్రస్తుత పిల్లలను మొబైల్ గేమ్స్, టీవీ, ట్యాబ్, కంప్యూటర్ లకి బానిస కాకుండా కొత్త విషయాలు నేర్చుకోవడం లో దృష్టిసారించాలని తెలిపారు. 12 రోజుల ఈ శిబిరంలో చేతిరాతతో పాటు చిత్రలేఖనం, నీతి కథలు, పద్యాలు, దేశభక్తి గేయాలు చెబుతూ, వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎజాస్ అహ్మద్, స్కైలాబ్, శ్రవణ్ కుమార్, జగదీశ్వర్, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.





## కమ్యూనిస్టులు దేశద్రోహులని మరోసారి నిరూపించుకున్నారు

-ఏబీవీపీ నగర కార్యదర్శి పరశురామ్

సిద్దిపేట టైమ్స్ సిద్దిపేట టౌన్:

చైనా కమ్యూనిస్టు పార్టీ ఉగ్రవాదుల ఫ్యాక్టరీ అయినటువంటి పాకిస్తాన్ కు మద్దతు తెలిపి కమ్యూనిస్టులు దేశద్రోహులని మరోసారి నిరూపించుకున్నారని ఏబీవీపీ నగర కార్యదర్శి పరుశురాం అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా చైనా, పాకిస్తాన్ జెండాలను దగ్ధం చేశారు . ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ ప్రపంచంలోనే అన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీల హెడ్ క్వార్టర్ అయిన చైనా కు చెందిన చైనా కమ్యూనిస్టు పార్టీ పాకిస్తాన్ కు మద్దతు తెలపడం అనేది అన్ని దేశాల్లో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు మద్దతు తెలపడంతోనే జరిగిందన్నారు.కమ్యూనిస్టులు ఇప్పుడే కాదు 1925 నుండి ఈరోజు వరకు ఎప్పుడూ దేశానికి వ్యతిరేకంగానే పనిచేస్తున్నారన్నారు.ఢిల్లీలోని జేఎనయులో తిష్ట వేసిన దేశ వ్యతిరేక శక్తులు ఈ దేశాన్ని ముక్కలు చేయాలని ఈ దేశాన్ని అస్థిరపరచాలని కుట్రలు పన్నుతున్నారన్నారు.విశ్వవిద్యాలయాల్లో దేశ వ్యతిరేక శక్తులు తీవ్రవాదులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు.విశ్వవిద్యాలయాల్లో తిష్ట వేసిన దేశ వ్యతిరేక శక్తుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కళాశాల అధ్యక్షులు భానుప్రసాద్, సంయుక్త కార్యదర్శులు విష్ణు,నరేష్,సోషల్ మీడియా కన్వీనర్ కార్తీక్, మరియు కృష్ణ,మల్లేష్, మహేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి




సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉంటూ అపరిచితుల మాటలు నమ్మవద్దని హుస్నాబాద్ షి టీం బృందం అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం ప్రజలకు మహిళా చట్టాలు, షీ టీమ్స్ నిర్వహిస్తున్న విధులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించిన సందర్భంగా షి టీం బృందం మాట్లాడారు. సోషల్ మీడియాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని మహిళల భద్రతకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని అన్నారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల విషయములో అప్రమత్తంగా ఉండాలని పాఠశాలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల ప్రవర్తన గమనిస్తూ ఉండాలని తల్లిదండ్రులకు సూచించారు. సెల్ఫోన్ వాడకం వల్ల ఎంత మంచి ఉందో అంత చెడు ఉందని వాటికి బానిసలు కావద్దని సూచించారు. మహిళలను ఎవరైనా వేధిస్తే 100 నంబర్ కు లేదా 8712667434 నంబర్ కు సమాచారం అందించాలని వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో షీ టీం బృందం హెడ్ కానిస్టేబుల్ సదయ్య, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు ఉన్నారు.

## ఇండ్ల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్న అధికారులు

సిద్దిపేట టైమ్స్ చేర్యాల / మద్దూరు ప్రతినిధి:



ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు అవకత వకలకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కమిటీ సభ్యుడు ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పినప్పటికీ మద్దూరు, దూలిమిట్ట మండలాలలో అధికారులు ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఉన్నప్పటికీ అవేమీ పట్టించుకోవడంలేదని అన్నారు. అధికారులు పూర్తిగా కొంతమంది అధికార పార్టీ నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరిస్తూ లబ్ధిదారుల ఎంపికలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిరుపేదలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ఎండి షఫీ, నారదాసు కనకయ్య, గూడా నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## పాముకాటుతో మహిళా మృతి

సిద్దిపేట టైమ్స్ రామాయంపేట ప్రతినిధి



నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ (కె)గ్రామంలో గ్రామానికి చెందిన జనగామ బాలవ్వ పాముకాటుతో మరణించడం జరిగింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మధ్యాహ్నం బాలవ్వ తన గుడిసెలో పడుకొని ఉండగా పాము కాటు వేయడంతో మరణించినట్లు తెలిపారు. పక్కనే ఉన్నటువంటి పామును కర్ర సాయంతో చంపి వేసామన్నారు. మృతురాలి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అమ్ముకున్నాయి.






# సాధా బైనామా దరఖాస్తులకు భూ భారతితో పరిష్కారం..

## జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి

సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట ప్రతినిధిబీ ఏప్రిల్ 28
పెండింగ్ సాధా బైనామా దరఖాస్తులకు భూ భారతి తో పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ ఎం మను చౌదరి అన్నారు. సోమవారం గజ్వేల్ పట్టణంలోని ఐఓసి లోని మీటింగ్ హాల్ లో గజ్వేల్ మండల రైతులు, ప్రజాప్రతినిధులతో భూ భారతి చట్టం అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి పాల్గొన్నారు. ముందుగా భూ భారతి చట్టం లోని వివిధ అంశాలను జిల్లా అదనపు కలెక్టర్ రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భూ సమస్యలు ఎదుర్కున్న విషయాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మేధావులు, ప్రజలు, ఇతలరులందరితో చర్చించి సలహాలు, సూచనలు స్వీకరించి 14 ఏప్రిల్ 2025 తేదీ నాడు ఈ భూ భారతి చట్టం అమలులోకి తెచ్చింది అన్నారు. పెండింగ్ లో ఉన్న సాధా బైనామా పరిష్కారం కోసం భూ భారతి చట్టంలో ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని అన్నారు. భూ భారతి చట్టం పై అవగాహన కల్పించేలా కర పత్రాలను పంపిణీ చేశామని, ప్రజలు వీటిని గమనించాలని ఏమైనా సందేహాలు ఉంటే తీర్చడానికి అధికారులు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని అన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్ల పై భూ భారతి చట్టం ప్రకారం ఆప్పీల్ చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయం పై కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయం పై భూమి ట్రిబ్యునల్ వద్ద అపీల్ చేసుకోవచ్చని, గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని, నేడు ఆ అవసరం లేకుండా అప్పీల్ వ్యవస్థకు అవకాశం కల్పించిందని అన్నారు. అప్పీల్ వ్యవస్థ అందించిన తీర్పు తర్వాత కూడా సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టు వెళ్ళవచ్చని, దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, మండల ప్రత్యేక అధికారీ సువర్ణ, తహసిల్దార్ , రైతులు, వివిధ వర్గాల ప్రజలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి కాలము దొంగలతో జాగ్రత్త

**- ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు శ్రేయస్కరం**
**- అనుమానిత వ్యక్తుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలి,**
**- జిల్లా ఎస్పీ.డి.ఉదయ్ కుమార్ రెడ్డి**

సిద్దిపేట టైమ్స్,
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వేసవి కాలం సెలవులు ప్రారంభం అయినవి పెళ్లి ముహూర్తాలు, మరియు స్నేహితులతో మరియు ఫ్యామిలీ మెంబర్స్ తో అంతా టూర్ ప్లాన్ చేస్తూ ఉంటారు. ఇదే అదునుగా దొంగతనాలకు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని జిల్లా ప్రజలు కూడా ఈ విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గారు ఒక ప్రకటనలో తెలిపారు.
దొంగతనాల నియంత్రణ కోసం జిల్లా ప్రజలు ఈ దిగువ తెలియజేసిన నిబ%శీ%ధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించగలరు. ఇంటి బయట, డాబాల పైన పడుకునేవారు మెడలో నగలని జాగ్రత్తగా పెట్టుకోండి మరియు ఇంటిలో బంగారు ఆభరణాలు ఉంచకండి. బసుల్లో ప్రయాణాలలో మీ బ్యాగ్ను మీ పైన ఉంచుకొని గట్టిగపట్టుకొని వెంట అంటిపెట్టుకోండి, గుర్తు తెలియని వ్యక్తులు తిను బండరాలు, కూల్డ్రింక్స్ లాంటివి ఇస్తే తినకండి తీసుకోకండి. మీరు ఊరికి వెళ్ళే సమయంలో వీలైనంత మేరకు ఇంటిలో విలువైన వస్తువులు, నగదు మరియు బంగారం ఆభరణాలు పెట్టకండి వాటిని బ్యాంకు లాకర్లో లేదా భద్రంగా ఉన్న చోట దాచుకోవడం ఉత్తమం అని తెలిపారు. బీరువా తాళం చెవులు బీరువా పైన కానీ, బీరువాలోని బట్టల క్రింద కానీ, ఇంట్లో కానీ పెట్టి వెళ్లవద్దు అని సూచించారు. ఇంటి ముందు తలుపులకు సెంటర్ లాక్ వేసి గేటు బయట గొళ్ళెం పెట్టకండి తెలిపారు. ఇళ్లకు నాసిరకం తాళాలు వాడొద్దు, తాళం కనపడకుండా కర్టెన్స్ వేయాలి. ఇంటి తలుపుల ముందు చెప్పులు ఉంచాలని సూచించారు. బయట గేటుకు లోపల నుంచి తాళం వేయాలని సూచించారు.



బయటకు వెళ్ళేపుడు ఇంట్లో మరియు బయట లైట్ వేసి ఉంచాలని సూచించారు.
పేపర్ బాయ్ మరియు పాలు వేసే వాళ్లకు రావద్దని తెలియజేయాలన్నారు.
నమ్మకమైన వాచ్ మెన్ లను మాత్రమే నియమించుకోవాలన్నారు.
మీరు ఊరికి వెళ్ళేటప్పుడు మీకు నమ్మకమైన వారికి అలాగే స్థానిక పోలీస్ స్టేషన్ లో సమాచారం ఇవ్వాలన్నారు. ఊరికి వెళ్ళిన తర్వాత కూడా ఇంటి పక్క వారికి ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటూ ఉండాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు, వాకిట్లో ముగ్గులు వేసేటప్పుడు మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్త. వీలైతే చీర కొంగుతో కవర్ చేసుకుంటే మంచిది మీ కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే దొంగలు భయపడే అవకాశం ఉంది, భద్రత ఎక్కువగా ఉంటుంది మీ ఇంటికి సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకుని %ణఎ=% రహస్య ప్రదేశాలలో భద్రపరుచుకోవాలన్నారు. మొబైల్ యాప్ ద్వారా సీసీకెమెరా దృశ్యాలు ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది మీరు బయటికి వెళ్ళే విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో షేర్ చేయకండి అని తెలిపారు. మీకు ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే 100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ కాల్ చేయాలని వివరాలు రహస్యంగా ఉంచుతామన్నారు.

# లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డికి లయన్స్ అంతర్జాతీయ అవార్డు

సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట ప్రతినిధి
లయన్స్ క్లబ్ రామాయంపేట చార్టర్ సభ్యుడిగా 35 సంవత్సరాలుగా ఆర్తుల సేవయే పరమావధిగా ఆర్తులకు అన్ని రకాలుగా సేవలందిస్తూ గత రెండున్నర దశాబ్దాలుగా రక్త అవయవ దానాలకు కృషి చేస్తూ, అత్య వసర పరిస్థితులలో అవసరము ఉన్నవారికి సేవలందిస్తూ, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, రక్త అవయవ దానాల ప్రచారానికి కార్యక్రమాలు నిర్వహిస్తూ ముఖ్యంగా యువతి యువకులకు అవగాహన కల్పిస్తూ, వృద్ధులకు ఆపదలో ఉన్నవారికి అన్ని రంగాలలో సేవలందిస్తున్న లయన్ డాక్టర్ ఏలేటి రాజశేఖర్ రెడ్డి కి లయన్స్ అంతర్జాతీయ అధ్యక్షులు లయన్ ఫ్రబయిషీయో అలివేరా అభినందిస్తూ లిలయన్స్ అత్యంత ప్రతిష్టాకరమైన ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లీడర్షిప్ మెడల్నులి లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జి. బాబురావు కానిస్టిట్యూషనల్ ఏరియా లీడర్ ఆర్ సునీల్ కుమార్ అభినందిస్తూ ఆదివారం సాయంత్రం హైదరాబాదు, షామీర్పేట్ లోని
ఎస్.ఎన్.ఆర్ పుష్ప కన్వెన్షన్ లో జరిగిన తెలంగాణ రాష్ట్రంలోని 8 లైన్స్ జిల్లాల నుండి పాల్గొన్న లయన్స్ ప్రతినిధులు పాల్గొన్న "మల్టీకాన్ కన్వెన్షన్" లో అవార్డును ప్రధానం చేశారు. కాగా రాజశేఖర్ రెడ్డి 54 మార్లు రక్తదానం చేసి ప్రాణాపాయకర స్థితిలో ఉన్నవారికి ప్రాణదానం చేస్తున్నారని, రక్తదాన శిబిరంలను నిర్వహిస్తూ, అవయవ దానం ల గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, మారుమూల గ్రామాలలో సైతం అవయవ దానానికి ప్రజలను సంసిద్ధం చేస్తున్నారని అన్నారు. లయన్స్ ఏరియా కాన్స్టిట్యూషనల్ లీడర్ లయన్ రుమాళ్ళ సునీల్ కుమార్ మాట్లాడుతూ రక్త అవయవదానాలపై రాజశేఖర్ రెడ్డి కృషి అభినందనీయమని, గతంలో కూడా ఉత్తమ సేవలు అందించి నందులకు రాజశేఖర్ రెడ్డి కి పలుమార్లు అవార్డులు అందుకున్నట్లు గుర్తు చేశారు... మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హనుమాన్ల రాజారెడ్డి మాట్లాడుతూ ప్రతి మాసం






గోడపత్రిక, కరపత్రంల ద్వారా రక్త అవయవ దానాల ప్రచారానికి కృషి చేస్తున్నారని అన్నారు.....
ఇప్పటివరకు రాజశేఖర్ రెడ్డి రూపొందించిన గోడపత్రికల ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని లోని ఎనిమిది లయన్స్ జిల్లాలలో రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, యువతి యువకులను ప్రోత్సాహ పరుస్తున్నారని గవర్నర్ లయన్ నగేష్ పంపాటి అన్నారు... లయన్స్ జిల్లా 320-డి గతంలో కూడా రక్త, అవయవ దానాలపై విస్తృత ప్రచార కార్యక్రమాలను నిర్వహించి రక్త, నేత్ర అవయవ దానాలకు, కరపత్రంల ద్వారా గోడపత్రికల ద్వారా యువతి యువకులకు, ప్రజలకు అవయవాల ప్రాముఖ్యత, ఆవశ్యకతపైన అవగాహన ఏర్పడిందని తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లోనే కాక ఇతర రాష్ట్రాలలో కూడా రక్త అవయవ దానాలకు ప్రజలు ముందుకు వస్తున్నారని లయన్ ఏ. అమర్నాథ్ రావు అన్నారు... లయన్ ఎమ్. విజయలక్ష్మి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ రామాయంపేట. రెడ్ క్రాస్ మెదక్ శాఖ సభ్యులు,మరియు రాజశేఖర్ రెడ్డి గ్రామీణ ప్రాంతాలలో వైద్య శిబిరాల ద్వారా రోగులకు, వివిధ సేవా కార్యక్రమాల ద్వారా ఆర్తులకు అన్ని రంగాలలో సేవలందిస్తున్నాయని అన్నారు, సేవలను ఇంకా విస్తృత పరిచి ప్రజలకు సేవా కార్యక్రమాలను అధికంగానిర్వహించాలని లయన్ డి. నరసింహారాజు తెలిపారు. 2024 -25 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాలలో లయన్స్ ఉత్తమ సేవలందించారని ముఖ్యంగా రాజశేఖర్ రెడ్డి కి అప్పగించిన రక్త అవయవ దానం లపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని లయన్స్ నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ 2024- 25 లయన్స్ సంవత్సరం జిల్లా 320-డి లోని లయన్స్ సభ్యులు "ఎంపవర్" నినాదంతో కార్యక్రమాలను నిర్వహిస్తూ, 35 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్, రామాయంపేట, రెడ్ క్రాస్ మెదక్ సంస్థల ద్వారా పరిసర ప్రాంతాలలో అన్ని విషయాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ముఖ్యంగా రక్త, అవయవదానాల అవగాహనకు యువతి యువకులకు, మారుమూల గ్రామస్తులకు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తు, లయన్స్ జిల్లా 320-డి లోని నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మెదక్ ,సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలలో సామాజిక మాధ్యమాలలో మరియు పత్రికలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించి నందులకు లయన్స్ నాయకులు బీ.వి బన్సల్, జి. ఆర్ సూర్య రాజ్ సి. ప్రకాశరావు, గంప రమేష్
ఎం.నాగరాజు, ఆసపల్లి శ్రీధర్, వెంపటి మధు, కే. సూర్యనారాయణ ఇవి రమణ, రామ్ ఫనిధర్ రావు, కరుణాకర్, జనార్ధన్ రెడ్డి, ప్రఫుల్ కుమార్, రమణారెడ్డి, తో పాటు పలువురు నాయకులు కొనియాడారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసిన కాంగ్రెస్ నాయకులు



సిద్దిపేట టైమ్స్ రామాయంపేట ప్రతినిధి
నిజాంపేట మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన కటికే మల్లికార్జున్ కు 18000,మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కను కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి,తాజా మాజీ సర్పంచ్ చెప్పెట నరసింహారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముత్యంరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమన్నారు. ఆపద కాలంలో నిరుపేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలస్వామి గుడి చేర్మెన్ రాంరెడ్డి మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, వార్డ్ నెంబర్లు బొమ్మన స్వామి , తిరుమలస్వామి ఆలయ కమిటీ సభ్యులు బాజా రమేష్, చాట్లపల్లి ఎల్లగౌడ్,కాకి రాజయ్య,బాజ నాగరాజు, ఆకుల రాజు, బొమ్మన నర్సయ్య, పడుమటి మహేందర్, బొమ్మన బిక్షపతి, బాగోళ్ళ స్వామి,కోతోల్ల స్వామి,చెంద్రకళ, నాలం వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మంజూరి అయిన ఇండ్ల అవకతవకలపై ఎంపీకి వినతి



సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :
మంజూరి అయిన ఇందిరమ్మ ఇండ్ల వాటి అవకతవకలపై భువనగిరి ఎంపీ చామల్ల కిరణ్ కుమార్ రెడ్డికి సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇండ్లు మంజూరైన అర్హులకు రిజిస్ట్రేషన్ పేపర్లు లేక సాదా బైనామా పేపర్లతో ఇండ్లు నిర్మించుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా పాత ఇండ్ల స్థానములో ఇంటి నెంబర్ ఉంటే వాటి పక్కన ఉన్న సొంత జాగలో ఇల్లు నిర్మించుకొనుటకు అనుమతి ఇవ్వడం లేదని ఇంటి నంబరు ఉన్న పక్క స్థలానికి ఇల్లు నిర్మించుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. రిజిస్ట్రేషన్ పేపర్లు లేనందున మంజూరి అయిన ఇండ్లను కోల్పోయే ప్రమాదం ఉందని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డికి వివరించగా సిద్దిపేట కలెక్టర్ కు ఫోన్ చేసి డాక్యుమెంటేషన్ లేనివారికి ఖాళీ స్థలాలలో ఇల్లు నిర్మించుకునే విధంగా న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమ్ము నర్సింగరావు, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కాటం మల్లేశం, ఎండి కాజా, వెలుగల దుర్గయ్య, తాటి పాముల పరుశరాములు, తుమ్మ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర కోకో టీం కోచ్ గా ఎంపికైన టేకుమల్ల వెంకటేష్

## అభినందనలు తెలిపిన డిఐఓ రవీందర్ రెడ్డి



సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట
తెలంగాణ రాష్ట్ర కొకో టీం కి ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న టి వెంకటేష్ నియామకం కావడం జరిగింది. ఏప్రిల్ 30 నుండి మే 5 వరకు ఢిల్లీలో చత్రపతి శివాజీ స్టేడియంలో జరిగే జాతీయస్థాయి ఎస్జిఎఫ్ అండర్ 19 కో కో పోటీలకు తెలంగాణ నుండి పాల్గొనే బాలుర కొ కొ టీం కు కోచ్ గా వ్యవహరిస్తారు. సిద్దిపేట జిల్లా డి ఐ ఈ ఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం తరఫున మన సిద్దిపేట నుండి జాతీయస్థాయి పోటీలకు కోచ్ గా వ్యవహరించడం సిద్దిపేట జిల్లాకు ఎంతో గర్వకారణమని తెలిపారు. సిద్దిపేట జిల్లా అండర్ 19 ఎస్.జి.ఎఫ్ కో-ఆర్డినేటర్ సమ్మయ్య మాట్లాడుతూ వెంకటేష్ సిద్దిపేట జిల్లా అండర్ 19 పోటీల నిర్వహణలో కీలక పాత్ర పోషించాలని ఇలాగే అంచలంచెలుగా పైకి ఎదగాలని కోరారు. తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర లో సిద్దిపేట జిల్లా తరఫున జాతీయస్థాయిలో పోటీలో పాల్గొనడానికి ఎంతో కృషి చేశాడని వెంకటేష్ క్రీడలలో ఎంతో ఆసక్తిని చూపుతారని ఇదే ఆసక్తితో ఉన్నత స్థానాలను చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర కళాశాల ఎఫ్ ఎ సి ప్రిన్సిపల్ దేవయ్య , సిద్దిపేట జిల్లా గెజిటెడ్ లెక్చరర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి నగేష్ , సీనియర్ అసిస్టెంట్ విట్టల్, యాదగిరి, వెంకటరమణ, స్పోర్ట్స్ ఇంచార్జ్ అశోక్, తదితరులు పాల్గొని అభినందించారు...

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :
ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని మండలంలోని ఆకునూరు జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అన్నారు. సోమవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల ఆధ్వర్యంలో అన్ని వార్డులలో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలల గురించి విద్యార్థులకు తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యత మైన విద్య లభిస్తుందని అనుభవం కలిగిన విద్యార్థులను చదివించి డబ్బులు వృధా చేసుకోవద్దని అన్నారు.



# ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి టవేరా





- బైక్ పై వస్తున్న ఇద్దరి మృతి,
- బీఆర్ఎస్ వజ్రోత్సవ సభ నుంచి వస్తున్న టవేరా
- సిద్దిపేటలో పనికి వెళ్లి బైక్ పై వస్తున్న బస్వాపూర్ గ్రామస్తులు









**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, ఏప్రిల్ 28:**
సిద్దిపేట హనుమకొండ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన తాడెం సారయ్య(35), బండోజు గణేశ్(36)అనే ఇద్దరు వ్యక్తులు సిద్దిపేటకు బైక్ పై పనికి వెళ్లి తిరిగి వస్తుండగా రాంపూర్ క్రాసింగ్ వద్ద వరంగల్ లో బీఆర్ఎస్ సభకు వెళ్లి తిరిగి సిద్దిపేట వైపు వస్తున్న టవేరా వాహనం ఎదురుగా వచ్చి ఢీకొంది. దీనితో బైక్ పై వస్తున్న తాడెం సారయ్య(35) అక్కడికక్కడే మృతి చెందాడు. బండోజు గణేశ్ తీవ్ర గాయాలతో కొన ఊపిరితో రహదారిపై పడిపోయాడు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ శ్రీను, రాజగోపాలపేట ఎస్ఐ అసిఫ్, పోలీసులు అక్కడికి చేరుకొని తీవ్ర గాయాలై కొన ఊపిరితో ఉన్న గణేశ్ ను పోలీసులు తమ వాహనంలో ఆసుపత్రి తరలించినా ఫలితం లేకుండా పోయింది. ఆసుపత్రికి వెళ్ళే లోపు గణేశ్ మృతి చెందాడు. చనిపోయిన తాడెం సారయ్య, బండోజు గణేశ్ ల మృతదేహాలను సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## మే 1 వ తేదీన వెన్నెల సాహితీ సంగమం వార్షికోత్సవం




**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఏప్రిల్ 28:**
సిద్దిపేటలోని శివానుభవ మండపంలో మే 1వ తేది(మేడే)న సిద్దిపేట వెన్నెల సాహితీ సంగమం వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి పర్క పెల్లి యాదగిరి సంస్థ ప్రతినిధులు వంగర నరసింహారెడ్డి, కొండి మల్లారెడ్డి, తాళ్ళ యేసు రాజు, మోర మోహన్, త్రివిక్రమ శర్మ, ఉమా శంకర్ తెలిపారు. సోమవారం సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్ లో వార్షికోత్సవానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్షికోత్సవంలో భాగంగా మూడు పాయలు కథల పుస్తకం ఆవిష్కరణ సభ జరుగుతుందన్నారు. అనంతరం మేడే కవి సమ్మేళనం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయితలు శిరం శెట్టి కాంతారావు, డా. బి. వి. ఎన్. స్వామి, కొండి మల్లారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పది నెలల గ్రాంటు మంజూరు చేయాలి

- పాఠశాలల పారిశుద్ధ్య గ్రాంట్ పై టి ఈ ఓ కు వినతి పత్రం అందించిన పీఆర్టీయూ



**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, ఏప్రిల్ 28**
పాఠశాల అవసరాలతో పాటు పారిశుద్ధ్య కార్మికుల కోసం ప్రభుత్వం కేటాయించిన స్కూల్ ఫెసిలిటీ గ్రాంట్ ( పారిశుద్ధ్య కార్మికుల నిధులు)ను జిల్లాలోని అన్ని పాఠశాలలకు పది నెలలకు మంజూరు చేయాలని పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డి, ఆదరాసుపల్లి శశిధర్ శర్మ కోరారు. ఈ మేరకు సోమవారం సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లెంకి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రస్తుతం పాఠశాలలకు ఆరు నెలల కోసం మాత్రమే పారిశుద్ధ్య కార్మికుల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటిలో మూడు నెలలకు సంబంధించి నిధులు పాఠశాలల ఖాతాలలో ఇప్పటికే జమ అయినట్లు తెలిపారు. మరో మూడు నెలలు నిధులు వారం రోజుల్లో సంబంధిత పాఠశాలల ఖాతాలలో జమ అవుతాయని విద్యాశాఖ అధికారి తెలిపారని అన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించుకున్నారని చెప్పారు. గత విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి వీరిని నియమించుకున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో పారిశుద్ధ్యం చాలా ముఖ్యమైన ప్రక్రియ అయినందున పది నెలల నిధులు పాఠశాలలకు మంజూరు చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ముత్యాల సురేందర్ రెడ్డి, సయ్యద్ సంధాని పాల్గొన్నారు.

## ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. మొక్కవోని దీక్షతో సభ విజయవంతం..




- బిఆర్ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు విజయవంతం చేశారు..
- సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, నాయకులు గుండు భూపేష్

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట**
ఎన్ని ఆటంకాలు సృష్టించినా.. మొక్కవోని దీక్షతో సభ విజయవంతం చేశారని, బిఆర్ఎస్ రజతోత్సవ సభను కార్యకర్తలు, తెలంగాణ ప్రజలు విజయవంతం చేశారని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం, నాయకులు గుండు భూపేష్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం వారు మాట్లాడారు. కార్యకర్తల ఉత్సాహం, హరీష్ రావు మార్గదర్శకాలతో బహిరంగ సభలో కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహించి సభా ప్రాంగణానికి స్వచ్ఛందంగా ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. బహిరంగ సభకు సిద్దిపేట నియోజకవర్గం నుండి భారీ ఎత్తున ప్రజలు సభకు హాజరయ్యారని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల కళ అయిన తెలంగాణ రాష్ట్ర సాధన కేసీఆర్ తోనే సాధ్యమైంది అన్నారు. 16 నెలల్లో ప్రజల ఆగ్రహానికి గురైన ప్రభుత్వాన్ని గతంలో ఏనాడు చూడలేదని..... 16 నెలల కాంగ్రెస్ పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయి ఉన్నారని చెప్పడానికి నిన్న సభకు తరలివచ్చిన జనమే నిదర్శనం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సభకు తరలివచ్చిన కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో మళ్లీ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయం అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్య ప్రచారాలు మానుకొని హామీల అమలు పై దృష్టి సారించాలని హితువు పలికారు. ఈ మీడియా సమావేశంలో కౌన్సిలర్ సాయన్నగారి సుందర్, నాయకులు మొహిజ్, జువ్వన్న కనకరాజు, ఇర్షాద్ హుస్సేన్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, నవీన్ పలువురు పాల్గొన్నారు.






## వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### ప్రధానోపాధ్యాయులు భాషిత్

**సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొమ్మాటలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్ వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి సుమారుగా 35 మంది విద్యార్థిని, విద్యార్థులు హాజరైనారు. ఈ శిక్షణ శిబిరాన్ని ఉద్దేశిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాసిత్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొమ్మాట లో తేదీ 28.4.2025 నుండి 3.5.2025 వరకు వేసవి శిబిరం నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. శిక్షణ శిబిరంలో విద్యార్థిని, విద్యార్థులకు యోగా,చిత్రకళ,క్రీడాంశాలు, సంస్కృత కార్యకలాపాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు .విద్యార్థి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం రాజేశ్వర్, మధురకవి, కిషన్ రెడ్డి, రాజు, రమేష్, కళ్యాణి పాల్గొన్నారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**
అర్హులైన వారికి గ్రామసభల ద్వారా మాత్రమే ఇండ్లను మంజూరీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట మావో డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ముస్త్యాల గ్రామ స్పెషల్ ఆఫీసర్ పిఆర్ఏఇ శివకుమార్ గ్రామములో 30 మంది లబ్ధిదారుల లిస్టును ఎంక్వయిరీ చేస్తున్న క్రమంలో సిపిఎం పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆయనకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకట్ మావో మాట్లాడుతూ ఎంపీడీవోకు సైతం వినతి పత్రం సమర్పించామని ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని అర్హత లేని వారిని తొలగించి అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో అందరినీ ఏకం చేసి పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేపాక కుమార్, ఎండి ఎజాస్, గుండ్ర రవీందర్, కొంగరి కృష్ణమూర్తి, చింత కింది డానియల్, యాడారం బ్రహ్మయ్య, నీరటి గాంధీ, తరిగొప్పుల సహదేవులు, తరిగొప్పుల మల్లయ్య, గోగురు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా మార్కండేయ స్వామి విగ్రహాల ఊరేగింపు

## మహిళల కోలాటం. ఇంటింటికి మంగళహారతులు. కన్నుల పండుగ ఉత్సవాలు..



సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్

మండల కేంద్రమైన రాయపోల్ లో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భక్త మార్కండేయ స్వామి ఉత్సవాలు సోమవారం వైభవంగా కొనసాగాయి. ఇందులో భాగంగానే మాకండేయ స్వామి ఆలయం నుంచి విగ్రహాలను ఊరేగింపు తో గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాల ఊరేగింపు ముందుకు కొనసాగింది. భారీ సంఖ్యలో మహిళల కోలాటం. యువకుల భక్తి ప్రావస్యం. ఇంటింటికి మంగళ హారతులు ఇవ్వడంతో విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా కొనసాగింది. ఉదయం ఆలయం నుంచి విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఊరేగింపు ను ప్రారంభించారు. గ్రామ పురవీధుల్లో ప్రతి ఇంటి నుంచి మంగళ హారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పద్మశాలి సంఘం కులస్తులు కూడా ఇంటింటా మంగళారతులు అందించి ముక్కులు చెల్లించుకోవడంతో శ్రీ భక్త మార్కండేయ విగ్రహాల ఊరేగింపు గ్రామస్తులు. భక్తులు. పద్మశాలి సంఘం సభ్యులు ముందుకు సాగుతూ ఊరేగింపు కొనసాగింది. మార్కండేయ స్వామి ఉత్సవాల్లో మొదటిరోజు ఆలయం నుంచి గ్రామ పురవీధుల్లో భక్తుల దర్శన భాగ్యం కోసం స్వామివారి మొక్కులు చెల్లించుకోవడానికి చెల్లించుకోవడానికి ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. మంగళవారం. బుధవారం. ప్రతిష్ట ఉత్సవాలు కొనసాగనున్నాయి. కాగా మార్కండేయ స్వామి ప్రతిష్ట ఉత్సవాలకు హాజరవుతున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా బుధవారం భక్త మార్కండేయ విగ్రహ ప్రతిష్ట ఉండడంతో గ్రామ పద్మశాలి సంఘం కుటుంబ సభ్యులు. వారి బంధువులు. భక్తులు ఇప్పటికే గ్రామానికి చేరుకోవడంతో రాయపోల్ మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# అనారోగ్యంతో బాధపడుతూ విశ్వకర్మ మృతి



సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్

మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని కమ్మరి భూమయ్య(87) కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందారు .భూమయ్య విశ్వకర్మ వృత్తిని చేపట్టి మండల వ్యాప్తంగా ఆ రోజుల్లో నిర్మించిన భవనాలను సుందరంగా తయారు చేసేవారు. ఆ రోజులలో రైతులు వ్యవసాయ పనిముట్లను తానే తమ కొలిమిలో తయారుచేసి వేలాది ఎకరాలకు పంటకు నీరు అందించే పరికరాలు తయారు చేయడంలో తనకు తానే దిట్టని చెప్పుకోవచ్చు నిరుపేద రైతన్నల కోసం గూడ బొక్కెన చాదబావి బొక్కెన బకెట్లు రైతులు వట్లను తిరిగి ఎందుకు పలచని రేకు సహాయముతో వ్యవసాయ పనిముట్లను తయారు చేసేవాడు దాంతోపాటు ఇంట్లో వాడే పరికరాలను కూడా తయారుచేసి తక్కువ రూపాయలకు అన్నదాతలకు అందజేసేవారు. కొంతకాలం పాపి కార్మికుడిగా సేవలందించడం జరిగిందని ఆయన చిరునాటి స్నేహితులు తెలిపారు.

# ద్విచక్రవాహనాలు డీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు



సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం తొగుటలో చోటు చేసుకుంది. స్థానిక కథనం ప్రకారం వివరాలు ఎలా ఉన్నాయి ...తొగుట మండల పరిధిలోని చందాపూర్ గ్రామానికి చెందిన పడల స్వామి (35) ,హైదరాబాద్ కు చెందిన రాజు (45)హీపీసీఎల్ కంపని పనిపైన సిద్దిపేట కు వెళ్తున్న క్రమంలో ద్విచక్ర వాహనంపై స్వామి కోపరేట్ బ్యాంకు నుండి రోడ్డు పైనకు దిగుతున్న క్రమంలో గజ్వేల్ నుండి సిద్దిపేటకు వెళుతున్న క్రమంలో రెండు చక్ర వాహనాలు ఢీకొనడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని అంబులెన్స్ లో సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# దుబ్బాక తాలూకా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

## - అధ్యక్షుడుగా కటకం రాజ మనోహర్ శర్మ,



సిద్దిపేట టైమ్స్ దుబ్బాక ప్రతినిదీ

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట వార్డులోని మార్కండేయ దేవాలయంలో తాలూకా బ్రాహ్మణ సంఘం ఎన్నికలు జరిగాయి.ఇందులో భాగంగా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా కటకం. రాజ మనోహర్ శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఆకారం చంద్ర శేఖర్ శర్మ, కోశాధికారిగా విఠాల.చంద్రశేఖర్ శర్మ, ఉపాధ్యక్షులుగా వేలేటి. రామక్రిష్ణ శర్మ , చప్పి.విశ్వ ప్రసాద్ శర్మ మరియు సంయుక్త కార్యదర్శులుగా చిలమకూరి.సురేష్, ఆకారం శ్రీనివాస్ రావు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సిద్దిపేట్ టైమ్స్ రామయంపేట ప్రతినిధి

రామాయంపేట మండలం దంతపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జేమ్లా తాండ లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో 7,500 రూపాయల విలువ గల చెక్కును పాత్లోత్ నిర్మల, శంకర్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి నిరుపేదల పాలిటీ పెన్నిదనీ కొనియాడారు. దీనికి సహకరించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. స్థానిక కాంగ్రెస్ నాయకులు మెగావత్ పాండు నాయక్. బన్సీ రాథోడ్. శీను. మదన్. రామచందర్ నాయకులు పాల్గొన్నారు.

# అభ్యర్థుల సంఖ్య పెరిగింది నిజమే!

## లెక్కింపులోనే తేడా వచ్చింది
## ఒకే సెంటర్ నుంచి ఎక్కువమంది ఎంపికవడం తప్పు కాదు
## గ్రూప్-1పై అప్పీల్ పిటిషన్‌లో టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఏప్రిల్ 28

గ్రూప్-1 మెయిన్‌కు హాజరైన అభ్యర్థుల్లో తొలుత ప్రకటించిన సంఖ్యకు తుది జాబితాకు మధ్య 10 మంది పెరిగిన మాట వాస్తవమేనని టీజీపీఎస్సీ అంగీకరించింది. తొలుత ప్రకటించిన అభ్యర్థుల సంఖ్య కంటే ఆ తరువాత శాస్త్రీయంగా సేకరించిన వివరాలను బేరీజు వేశాక ఆ సంఖ్య మరో పది పెరిగిందని హైకోర్టుకు తెలియజేసింది. గ్రూప్-1 నియామకాలను తాతాలికంగా నిలిపివేయాలని ఈ నెల 17న సింగిల్ జడ్జి జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను రద్దుచేయాలని కోరుతూ టీజీపీఎస్సీ ద్విసభ్య ధర్మాసనం ఎదుట అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. టీజీపీఎస్సీ అదనపు కార్యదర్శి సుమతి (నోడల్ ఆఫీసర్ -లీగల్ ) ఈ అప్పీల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు జరిగిన మెయిన్ పరీక్షలు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మలాజిగిరి జిల్లాల (మూడు కమిషనరేట్లు) పరిధిలో జరిగాయని తెలియజేసింది. పరీక్షలు పూర్తవగానే సూపరింటెండెంట్లు ఇచ్చిన సమాచారం ఆధారంగా హాజరైన అభ్యర్థుల సంఖ్యను 21,075 అని ప్రకటించామని పేర్కొంది. ఆ తరువాత అభ్యర్థులు ఉపయోగించిన, ఉపయోగించని జవాబు పత్రాలు ఓఎంఆర్, నామినల్ రోల్స్ మొత్తం విశ్లేషించిన మీదట వారి సంఖ్య 21,085కు పెరిగిందని వివరించింది. పది మంది అభ్యర్థుల సంఖ్య పెరగడం వెనుక లెకింపుల్లో తేడా జరిగిందని తెలిపింది. ఆ మేరకు మళ్లీ ప్రకటన విడుదల చేశామని పేర్కొంది. బీ పూజితారెడ్డి అనే అభ్యర్థిని రీకౌంటింగ్‌లో తేడా ఉందని 60 మారులు తగ్గాయని వినతిపత్రం సమర్పించారని, దీనిని పరిశీలిస్తే కౌంటింగ్‌కు ముందు ఆ తర్వాత కూడా ఆమె మారులు 422.4 వచ్చాయని, ఆమె వినతిపత్రంలో మారులను తారుమారు చేసి ఇచ్చారని అప్పీల్ పిటిషన్‌లో వివరించారు.

### గందరగోళం నివారణకే వేరే హాల్‌టికెట్లు

పరీక్ష కేంద్రాలను గుర్తించడానికి, తనిఖీలు చేయడానికి టీజీపీఎస్సీకి తగిన సిబ్బంది లేకపోవడంతో ఆ బాధ్యతను జిల్లా కలెక్టర్లుకు ఇచ్చామని తెలిపారు. కోఠి మహిళా కాలేజీలో పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్లు లేకపోవడంతో ఆ కేంద్రాన్ని మహిళా అభ్యర్థులకు మాత్రమే కేటాయించామని పేర్కొన్నారు. బేగంపేట కాలేజీలో కేవలం మహిళలే ఉన్నారని, కోఠి మహిళా కళాశాలలోని రెండు సెంటర్ల నుంచి ఎకువమంది అర్హత సాధించారన్న ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. 18వ సెంటర్‌లో 5.41 శాతం, 19వ సెంటర్‌లో 4.12 శాతం చొప్పున అభ్యర్థులు అర్హత సాధించడం అసాధారణ విషయమేమీ కాదని అన్నారు. ఒకే సెంటర్ నుంచి ఎకువ మంది ఎంపికవడంలో తప్పేమీలేదని తెలిపారు. ఎస్టీ క్యాటగిరీలో టాప్ ర్యాంకు 206 కాదని, ఎరుకుల సామాజికవర్గానికి చెందిన యువతికి 12వ ర్యాంక్ వచ్చిందని తెలియజేశారు. ప్రిలిమ్స్ రాష్ట్రవ్యాప్తంగా జరిగినందున హాల్ టికెట్లపై జిల్లా, పరీక్ష కోడ్ వేయాల్సివచ్చిందని వివరించారు. అయితే, మెయిన్ పరీక్ష కేవలం జీహెచ్‌ఎంసీ పరిధిలోనే నిర్వహించినందున కోడ్‌ల విషయంలో అయోమయం ఏర్పడకుండా ఉండేందుకే మళ్లీ వేరే హాల్‌టికెట్లు ఇవ్వాల్సివచ్చిందని వివరించారు. బొమ్ము పూజితరెడ్డి అనే అభ్యర్థి తనకు రీకౌంటింగ్ తర్వాత మారులు తగ్గాయని తప్పుడు వినతిపత్రం ఇచ్చారని, ఆమెపై సర్వీస్ కమిషన్ చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

### అదనపు పరీక్ష కేంద్రం ఎందుకంటే..

సీవీఆర్ కాలేజీలో మొదట 984 మంది అభ్యర్థులకు ప్రతిపాదన చేశామని, మహిళా విశ్వవిద్యాలయంలోని పరీక్ష కేంద్రంలో గ్రౌండ్ ఫ్లోర్ ఎత్తు ఎకువగా ఉన్నందున దివ్యాంగులకు ఇబ్బంది అవుతుందని భావించి ఇకడి నుంచి 87 మందిని సీవీఆర్ కాలేజీకి కేటాయించామని టీజీపీఎస్సీ తన అప్పీల్‌లో వివరించింది. దీని ఫలితంగా మహిళా విశ్వవిద్యాలయంలో అభ్యర్థులు 984 నుంచి 787కు తగ్గారని తెలిపింది. సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కాలేజీలో అభ్యర్థుల సంఖ్య 504 నుంచి 358 మందికి తగ్గిందని, 24 మంది సామర్థ్యం ఉన్న గదిలో దివ్యాంగులకు తోడుగా పరీక్ష రాయడానికి వచ్చే వారు ఉన్నందున, ఒక్కో గదిలో ఆరుగురినే కేటాయించాల్సి వచ్చిందని తెలియజేసింది. దీనివల్ల అదనంగా మరో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సివచ్చిందని తెలిపింది. మూల్యాంకనం కోసం ఇంగ్లిష్‌కు 33, జనరల్ ఎస్సే 57, చరిత్ర, సంస్కృతి 28, జాగ్రఫీ 22, ఇండియన్ సొసైటీ 22, రాజ్యాంగం 24, పరిపాలన 23, ఆర్థికశాస్త్రం, అభివృద్ధి 38, సైన్స్ అండ్ టెక్నాలజీ 21, బయోటెక్నాలజీ 26, డాటా ఇంటర్‌ప్రిటేషన్ 18, తెలంగాణ ఉద్యమం, రాష్ట్రం ఏర్పాటు అంశానికి 40 మంది చొప్పున కేటాయించామని వివరించింది.

### గ్రూప్-1 నియామకాలపై స్టే కొనసాగింపు :

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గ్రూప్-1 నియామకాలను తాతాలికంగా నిలిపివేస్తూ ఈ నెల 17న జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయంటూ ఎం పరమేశ్ మరో 20 మంది అభ్యర్థులు దాఖలు చేసిన కేసులో న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ఈ నెల 17న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని ఆదేశాలిచ్చారు. ఆ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చినప్పుడు.. సర్వీస్ కమిషన్ న్యాయవాది జోక్యం చేసుకుంటూ మధ్యంతర ఉత్తర్వులను సస్పెండ్ చేయాలని కోరుతూ టీజీపీఎస్సీ ద్విసభ్య ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసినట్టు చెప్పారు. దీంతో విచారణ వాయిదా పడింది. మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని వెల్లడించింది.

# మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య




సిద్దిపేట టైమ్స్ దౌల్తాబాద్:

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన తొగుట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తొగుట పట్టణానికి చెందిన సిరివెరి నరేష్ గౌడ్ 30 ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు తండ్రి వెంకట్ గౌడ్ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని శవ పంచారామ నిమిత్తం కొరకై సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.